క్లుప్తంగా

గరుడ వాహనంపై వరదరాజస్వామి చిద్విలాసం



గరుడ వాహనంపై ఊరేగుతున్న వరదరాజస్వామి

కుప్పం రూరల్: కుప్పం మున్సిపాలిటీలోని లక్ష్మీపురంలో నిర్వహిస్తున్న శ్రీ వరదరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి గరుడోత్సవం ఘనంగా నిర్వహించారు. జూన్ 12 వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. స్వామి వారిని అందంగా అలంకరించి, గరుడ వాహనంపై ఆశీనులు చేసి పురవీధుల్లో వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ఊరేగించారు. భక్తులు స్వామి వారికి పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించారు. 6న రథోత్సవం, 10న సింహవాహనం, 12న విశ్వరూప సేవతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని నిర్వాహకులు చెప్పారు.

వేధింపులకు నిరసనగా ధర్నా

పుంగనూరు: భారతదేశానికి స్వర్ణపతకాలు సాధించిన మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులను ఖండిస్తూ ఎస్‌డీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు శుక్రవారం మాట్లాడుతూ బీజేపీ అధికార బలంతో క్రీడాకారులను వేధించడం బాధాకరమన్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకుంటే దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

11మంది గైర్హాజరు

పులిచెర్ల(కల్లూరు): పదవతరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో తొలిరోజు నిర్వహించిన తెలుగు పేపరు పరీక్షలకు 61మందికిగాను 11మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ సిద్దరామయ్య తెలిపారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంగా పులిచెర్ల, సదుం, రొంపిచెర్ల మండలాలకు సంబంధించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

గాలులకు రాలిన మామిడి కాయలు



మామిడి కాయలను కొనుగోలు చేస్తున్న వ్యాపారస్తులు

తవణంపల్లె: మండలంలో వీచిన పెనుగాలులకు మామిడి కాయలు రాలిపోయి రైతులకు నష్టం సంభవించింది. మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలులకు సుమారు 150 టన్నులకు పైబడి రాలిపోయాయి. రాలిన మామిడి కాయలను వ్యాపారులు కిలో రూ.7 నుంచి రూ.10 వరకు కొనుగోలు చేస్తున్నారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూతలపట్టుకు మూడు ట్రాక్టర్లు



ట్రాక్టర్ పంపిణీ చేస్తున్న అధికారులు

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా మండలానికి బుధవారం 3 ట్రాక్టర్లను చిత్తూరు ఏడీఏ మధుసూదన్‌రెడ్డి చేతులమీదుగా రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి మధురవాణి తెలిపారు. పూతలపట్టు భీమేశ్వర గ్రూప్, గొడుగుచింత వెంకటేశ్వర గ్రూప్, పి.కొత్తకోట డాక్టర్ వైఎస్సార్ గ్రూప్‌కి ఈ ట్రాక్టర్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్ యూనిట్ ధరను బట్టి రైతు వాటా 10 శాతం, ప్రభుత్వ రాయితీ 40 శాతం, బ్యాంకు రుణం 50 శాతం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నీలిమ, నవీన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తిరునాళ్ల



పానాటూరులో ముత్యాలమ్మ

గుడిపాల: పానాటూరు గ్రామంలో శుక్రవారం ముత్యాలమ్మ తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి గ్రామంలోని మహిళలు అంబలి పోశారు. అనంతరం ప్రత్యేకంగా పూజలు, అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి గ్రామవీధుల్లో బాణసంచా వేడుకలు, మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ



లబ్ధిదారులకు సంక్షేమ లబ్ధిని బుక్‌లెట్‌తో వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలను ఇస్తోందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శుక్రవారం మండలంలోని కొంగాటం గ్రామ సచివాలయ పరిధిలోని విభూది ఎల్లాగరం, అత్రపల్లె, మహ్మద్‌పురం, సంతగట్టు, కావాలి వాణివంక, పసలమంద గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. మొత్తం 477 గృహాలను సందర్శించారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. అర్హత ఉన్ననూ సాంకేతిక కారణాల మూలాన సంక్షేమ పథకాలు అందని పక్షంలో దరఖాస్తు చేసుకుంటే అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. తమకు పథకాలు అన్నీ అందుతున్నాయని, గతంలోలా వి.కోటలోని కార్యాలయాలకు వెళ్లే అవసరం లేదని, వలంటీర్లే అన్ని సేవలూ ఇళ్ల వద్దకే వచ్చి అందిస్తున్నారని పలువురు ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు.

హామీలతో వంచించడం బాబు నైజం

చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు 600 హామీలను గుప్పించారని, అధికారంలో అధికారంలోకి వచ్చాక వాటిని అటకెక్కించి, ప్రజలను వంచించారని ఎమ్మెల్యే విమర్శించారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను కాపీ కొట్టి హామీలుగా ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, ఆయనకు రాబోవు ఎన్నికల్లో మళ్లీ బుద్ధి చెప్పాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్నే ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే తన దృష్టికి గ్రామస్తులు నివేదించిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌రెడ్డి, ఎంపీపీ యువరాజు, పంచాయతీ సర్పంచ్ అనితారెడ్డి, ఎంపీటీసీలు కమల్, సమద్, రెస్కో డైరెక్టర్ భూపతి, పంచాయతీ నాయకులు జయరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శుక్రవారం మండలంలోని బందార్లపల్లె పంచాయతీలోని ఎర్రచేన్లు, కొతారిగడ్డ, బోయినపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వ పథకాలను తెలియజేశారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అమలు చేసి, పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. నవరత్నాల ద్వారా రాష్ట్రంలో అత్యధికంగా పేద కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. కొతారిగడ్డకు చెందిన శ్రీనివాసులు ప్రభుత్వం నుంచి పథకాల రూపేణా రూ.5.63 లక్షల లబ్ధి పొందారని ఉదహరించారు. గత టీడీపీ పాలనలో అర్హులకు పథకాలు అందేవి కావని, ఇప్పుడు ప్రజల ముంగిటకే అన్నీ అందేలా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో జగనన్న చరిత్ర సృష్టించారన్నారు. అలాగే రైతాంగం సంక్షేమానికి ప్రాధాన్యత ఎనలేని ప్రాధాన్యత నిచ్చి రైతు భరోసా కేంద్రాలతో రైతులకు వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, ఎరువులు మొదలైనవన్నీ అందేలా చేశారన్నారు. ప్రజలు నివేదించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఎమ్మెల్సీ ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, మాజీ జెడ్పీటీసీ ఆరేళ్ల జయప్ప, స్థానిక సర్పంచ్ రాజగోపాల్, ఎంపీటీసీ సభ్యురాలు సౌమ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, నేతలు రామకృష్ణారెడ్డి, సురేంద్రరెడ్డి, నరేంద్రరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీవర్ధన్, వార్డు సభ్యులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పెనుగాలుల ధాటికి ఇంటిపై పడ్డ ఫ్యాక్టరీ రేకులు



ఇంటిపై పడ్డ ఫ్యాక్టరీ రేకులు

గంగవరం: పెనుగాలుల ధాటికి ఫ్యాక్టరీపై కప్పిన రేకులు ఓ ఇంటిపై పడడంతో ఇంటి పైకప్పు, గోడలు ధ్వంసమైన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని గంద్రాజుపల్లె సమీపంలో ఎస్‌ఈజెడ్‌కు కేటాయించిన స్థలంలో కొన్ని ఫ్యాక్టరీలను స్థాపించారు. టమోట క్రేట్లు తయారు చేసే మార్వెల్ పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమ నిర్మాణాలపై ఉన్న పెద్ద రేకులు పెనుగాలులకు ఎగిరి పక్కనే ఉన్న రెడ్డెప్పరెడ్డి ఇంటిని కప్పేసినట్లు పడ్డాయి. వీటి దెబ్బకు గోడలు ధ్వంసమయ్యాయని బాధితుడు వాపోయాడు. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ప్రమాదం చోటు చేసుకోలేదు. ఫ్యాక్టరీ యాజమాన్యం తన ఇంటి మరమ్మతులకు పరిహారం చెల్లించాలని బాధితుడు కోరాడు.

8న నూతన మండల కాంప్లెక్స్ ప్రారంభం



పుంగనూరులో నూతన నిర్మించిన మండల కార్యాలయాల సముదాయం

పుంగనూరు: పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో నిర్మించిన మండల కార్యాలయ భవనాలను ఈ నెల 8న గురువారం రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండల కార్యాలయం, తహసీల్దార్, వ్యవసాయశాఖ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని మంత్రి పెద్దిరెడ్డి రూ.2.6 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో అత్యంత సుందరంగా అధునాతన వసతులతో మండల కార్యాలయాలు నిర్మించినట్లు తెలిపారు. ఈ భవనాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్న మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ హాజరు కావలెనని కోరారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు



చౌడేపల్లె ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులతో అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధిచేశారు. రాహుకాల సమయంలో వేదపండితులతో అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈఓ చంద్రమౌళి పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

దాడి కేసులో టీడీపీ కార్యకర్తల అరెస్ట్

గంగవరం: వైఎస్సార్‌సీపీ నాయకుడు, గ్రామ సచివాలయ కన్వీనర్ కుటుంబ సభ్యులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో ఐదుగురు నిందితులను గంగవరం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం.. గత నెల 20న మండలంలోని మార్జేపల్లెలో టీడీపీ కార్యకర్తలు కొంతమంది గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు, గ్రామ సచివాలయ కన్వీనర్ చిన్నరెడ్డెప్ప కుటుంబసభ్యులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. ఒకరిని అరెస్ట్ చేసి రిమాండు తరలించారు. మిగిలిన వారందరూ పరారయ్యారు. కేసు దర్యాప్తులో మిగిలిన వారిలో అమర్‌నాథరెడ్డి, సునీల్, విశ్వేశ్వరయ్య, జయదీప్, బాలరాజును బెంగళూరులో శుక్రవారం ఉదయం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరిని అరెస్ట్ చేయాల్సి ఉంది.

హిందూ సామ్రాజ్యానికి ఛత్రపతి ఆదర్శం



పుంగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ జాగరణ సమితి

పుంగనూరు: హిందూ సామ్రాజ్యం ఏర్పాటుకు ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడని, నినాదాలు చేస్తూ హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం చేసిన రోజును పురస్కరించుకుని యువకులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

హిందూ ధర్మాన్ని చాటిచెప్పిన వీరుడు శివాజీ



నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

పలమనేరు: హిందూ ధర్మాన్ని చాటి చెప్పిన ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పట్టణ బీజేపీ అధ్యక్షుడు అబ్బూరి తాతయ్య అన్నారు. హిందూ సామ్రాజ్య దివస్ పురస్కరించుకుని శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో శివాజీ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, 1674లో జేష్ఠ శుద్ధ త్రయోదశి నాడు శివాజీ మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించారని పేర్కొన్నారు. దీనిని గుర్తు చేసుకుంటూ ఏటా హిందూ సామ్రాజ్య దివస్‌గా జరుపుకుంటున్నట్టు చెప్పారు. అనంతరం పిల్లలకు మిఠాయిలను పంచిపెట్టి వీర శివాజీ చరిత్రను తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమ, లోకేష్, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బహు వార్షిక పశుగ్రాసాలతోనే పాల దిగుబడి





పలమనేరు సమీపంలోని పశు పరిశోధన కేంద్రం వద్ద పెంచిన అలసంద, లూసెర్న్ పశు గ్రాసాలు

పలమనేరు: వేసవి కాలంలో పాడి ఆవుల్లో పాల ఉత్పత్తి పెరగాలంటే బహువార్షిక పశుగ్రాసాలను రైతులు పెంచుకోవడం ఉత్తమం. సంకర జాతి పాడి ఆవులకు పచ్చిమేత అవసరం చాలా ఉంది. కేవలం ఎండు గడ్డితోనే అధిక పాల ఉత్పత్తి సాధ్యం కాదు. కాబట్టి పలమనేరు నియోజకవర్గంలోని పాడి రైతులు బహువార్షిక పశుగ్రాసాలను పెంచుకుంటే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని స్థానిక ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ పశు పరిశోధనా సంస్థ సైంటిస్ట్ డాక్టర్ వేణు సూచిస్తున్నారు. నీటి పారుదల సౌకర్యం ఉన్న రైతులు హైబ్రీడ్ నేపియర్, లూసర్న్ పశుగ్రాసాన్ని ఏడాది పొడవునా సాగుచేసుకోవచ్చు. ఒకే పంటకైతే మొక్కజొన్న ఉత్తమం. మెట్ట ప్రాంతాల్లో అయితే జొన్న, సజ్జ ఎంతో మేలు. చౌడు భూముల్లో రోడ్స్, మిశ్రమ పంటగా అలసంద, చెట్ల నీడల్లో గిని, స్టైలో, నీరు నిల్వ ఉండే భూములో పారా గడ్డి, బంజర భూముల్లో అంజన్, సైలేజ్ కోసం మొక్కజొన్న, సజ్జ, నేపియర్ ఎంతో ఉపయోగదాయకం. ఏక వార్షిక పశుగ్రాసాలైన జొన్న, మొక్కజొన్న, సజ్జ, ఓట్స్, బర్సీమ్, జనుము, పిల్లిపెసర, అలసందలు ఏ కాలంలోనైనా సాగు చేసుకోవచ్చు. ఇక బహు వార్షిక పశుగ్రాసాలైన హైబ్రీడ్ నేపియర్, పారాగడ్డి, గిని, లూసర్న్, అంజన్, దీననాథ్, స్టైలో హెమాటా, హెడ్జ్ లూసర్న్, స్టైలో స్కాబ్రాలు ఎండు మేతగా, పచ్చి మేతగా కూడా ఉపయోగించుకోవచ్చని సైంటిస్ట్ వివరించారు. ఈ పశుగ్రాసాలను రైతులు పెంచుకున్నట్లయితే తక్కువ ఖర్చుతో అధిక పాల ఉత్పత్తి సాధ్యమేనని, మరోవైపు దాణా ఖర్చు కూడా తగ్గించుకోవచ్చని ఆయన చెప్పారు. ఇతర వివరాల కోసం పలమనేరు సమీపంలోని కేటిల్ ఫామ్ వద్దనున్న పరిశోధన కేంద్రాన్ని సంప్రదించి రైతులు అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

మొరంకిందపల్లె ఆలయంలో చోరీ

చౌడేపల్లె: పరికిదొనపంచాయతీ మొరంకిందపల్లె గ్రామదేవత బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ నిర్వహించారు. శుక్రవారం ఉదయం పూజలు చేయడానికి వెళ్లిన మహిళలు గుర్తించి గ్రామస్తులకు తెలిపారు. గుడి తలుపులు ధ్వంసం చేసిన దుండగులు ఆలయంలోని ప్రవేశించి హుండీ తాళాలు పగులగొట్టారు. సుమారు రూ.10 వేల వరకు నగదు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నీటి కష్టాలకు చెల్లు చీటి



నాడు : పాతపేటలో నీటి కష్టాలు పడుతున్న మహిళలు



నేడు : పాతపేటలో మినీ ట్యాంకుల వద్ద నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

బైరెడ్డిపల్లె: గత ప్రభుత్వ హయాంలో చెరువుల్లో చుక్కనీరు లేక, గ్రామాల్లో ప్రజలకు తాగడానికి నీరు కరువై, ధర్నాలు, రాస్తారోకోలు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఒక్కో రైతు 5 మొదలు 15 బోర్లు వేసినా నీటి జాడ లేకపోవడంతో అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారు. మరికొందరు రైతులు కుటుంబాలతో సహా వలసలు వెళ్లిపోయారు. మరికొందరు అరకొర నీటితో పంటలు సాగు చేసినా చేతికందే దశలో ఎండుముఖం పట్టేవి. తాగునీటి కష్టాల మూలాన మహిళలు కిలోమీటర్ల దూరం వెళ్లి వ్యవసాయ బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకునేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వర్షాలు పుష్కలంగా కురిసి, చెరువులు, కుంటలు, బావులు జలకళ సంతరించుకున్నారు. భూగర్భ జలాల మట్టం పెరిగింది. బోర్లలోకి నీళ్లు చేరాయి. తాగునీటి కష్టాలు తీరాయి. వలసలు వెళ్లిన రైతులు తిరిగి స్వగ్రామాలకు చేరుకుని మళ్లీ వ్యవసాయం చేస్తున్నారు. గతంలో

మండలంలోని పాతపేటలో ఒక్కో కుటుంబానికి ఐదు బిందెల నీళ్లు మాత్రమే పట్టుకోవాల్సి వచ్చేది. తాగునీళ్లు ఎప్పుడొస్తాయా? అని ఎదురు చూసేవారు. ఇప్పుడా బాధలు లేవు. ప్రస్తుతం పాతపేటలో మినీ ట్యాంకులు ఏర్పాటు చేశారు. విద్యుత్ ఉన్న సమయంలో ట్యాంకులకు నీరు నింపి ఎల్లవేళలా నీటి సౌకర్యం కల్పించారు. ఇలా ఒక్క పాతపేట మాత్రమే కాకుండా గొల్లచీమనపల్లె, మురారిపల్లె, గోపాలపురం, కీలతొరిడి, లక్కనపల్లె, శెట్టిపల్లె, తీర్థం, కడపనత్తం, వెంగంవారిపల్లె, కడతట్లపల్లె, దేవదొడ్డి, నెల్లిపట్ల, రఘునాయకులదిన్నె, బెల్లంమడుగు, దాసార్లపల్లె, రామసముద్రం, సన్నిపల్లె తదితర గ్రామాల్లో తాగునీటికి కష్టాలు పడ్డారు.

నీటి కష్టాలు లేవు

గతంలో తాగునీటికి అష్టకష్టాలు పడేవాళ్లం. బిందె నీరు పట్టుకోవాలంటే నడుములోతు గుంతలోకి దిగాల్సిందే. కుటుంబానికి సరిపడా నీరు వచ్చేది కాదు. పొలాల కాడికి వెళితే రైతులు రావద్దని కటువుగా చెప్పేవాళ్లు. ఇప్పుడు ఎప్పుడు కావాలంటే అప్పుడు నీళ్లు వస్తున్నాయి. నీటి కష్టాలు తప్పాయి.

– మునెమ్మ, పాతపేట

ధర్నా చేసినా ఫలితం శూన్యం

తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. నీటి సమస్యను పరిష్కరించాలని ధర్నాలు కూడా చేశాం. ఫలితం లేకపోవడంతో చందాలు వేసుకుని ట్యాంకర్లతో నీటిని తెప్పించుకునేవాళ్లం. ఇప్పుడా సమస్య లేదు. బోర్లలో నీళ్లు పుష్కలంగా వస్తున్నాయి. మాకు అధికారులు ఇబ్బందులు లేకుండా చేశారు.

– కాంచన, పాతపేట

సప్త కనికలమ్మ సేవలో మంత్రి





సప్తకనికలమ్మ, అమ్మవారిని దర్శించుకుంటున్న రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం దొడ్డిపల్లిలోని శ్రీ సప్తకనికలమ్మను శుక్రవారం రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, నాయకులు భూపేష్ గోపినాథ్, కృష్ణమూర్తి, లోకేష్ రెడ్డి, గురుకువారిపల్లె ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై వెంకన్న వైభవం



సింహ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

వడమాలపేట: అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అభిషేకం (ఏకాంతం) అలంకారం, మొదటి గంట అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ వేంకటేశ్వరుడు సింహ వాహనంపైకి వేంచేసి శ్రీనరసింహస్వామి అలంకారంలో ఉదయం 8 గంటల నుంచి 9 వరకు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శుద్ధి, రాత్రి కైంకర్యాలు నిర్వహించి ఊంజల్ సేవ నిర్వహించారు.

ముత్యపు పందిరిపై గోవిందుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి 7 గంటల నుంచి 8 వరకు గోవిందుడు ముత్యపు పందిరి వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులను కటాక్షించారు. వాహన సేవ అనంతరం స్వామి వారికి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పాచార్యులు పాల్గొన్నారు.